ప్రభుత్వోద్యోగులకు రెండు డిఏలు

- ఒకటి ఇప్పుడే చెల్లింపు.. రెండోది ఆరు నెలల్లో...
- బకాయిలు ప్రతీనెలా చెల్లింపులు
- ఉద్యోగుల కోసం హెల్త్ కేర్ ట్రస్టు ఏర్పాటు
- సన్నధాన్యం పండించే రైతులకు ప్రోత్సాహకాలు.. బోనస్ కొనసాగింపు
- కొత్తగూడెంలో ఎర్త్‌సైన్స్ వర్సిటీకి మన్మోహన్ సింగ్ పేరు
- ఎస్‌హెచ్‌జి సభ్యులు మరణిస్తే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా
- మంత్రివర్గం నిర్ణయాలు



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు రెండు డిఎలు ఇచ్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. వీటిలో ఒక డిఎను వెంటనే చెల్లించాలని, రెండో డిఎను మరో ఆరు నెలల్లో చెల్లించాలని నిర్ణయించింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సిఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో తీర్మానించారు. ఐదున్నర గంటలపాటు కొనసాగిన క్యాబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సంబంధిత వివరాలను డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాకు వివరించారు. విలేకర్ల సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రివర్గ నిర్ణయాలివే...

1 రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు రెండు డిఏలు ఇచ్చేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

2 ఒక డిఎను వెంటనే చెల్లించాలని, రెండో డిఎను మరో ఆరు నెలల్లో చెల్లించాలని నిర్ణయం తీసుకుంది.

3 2023 జనవరి 1 నుంచి బకాయి ఉన్న డిఎలలో ఒక డిఎను వెంటనే చెల్లిస్తుంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు బకాయి పడ్డ ఎరియర్స్‌ను 28 వాయిదాల్లో చెల్లిస్తారు.

4 మరో డిఎను వచ్చే ఏప్రిల్‌లో ప్రకటించాలని నిర్ణయం తీసుకుంది.

5 ఉద్యోగ సంఘాలతో జరిపిన చర్చల వివరాలను డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క క్యాబినెట్‌కు నివేదించారు.

6 ఉద్యోగుల డిమాండ్లపై మే 6న ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికారుల కమిటీ తమ నివేదికను సమర్పించింది.

7 ఉద్యోగులు ఇచ్చిన 57 డిమాండ్లను పరిశీలించిన మంత్రివర్గం, అధికారుల కమిటీ నివేదిక ప్రకారం కొన్ని అంశాలను ఆమోదించగా, కొన్నింటిని పరిశీలనకు స్వీకరించింది.

8 ఉద్యోగులకు సంబంధించిన బకాయిలను ఇకపై ప్రతి నెలా క్రమపద్ధతిలో చెల్లించాలని నిర్ణయం తీసుకుంది. ప్రతి నెలా రూ.700 కోట్లు వీటికి చెల్లించాలని నిర్ణయం.

9 ఉద్యోగుల హెల్త్ కార్డులకు సంబంధించి మంత్రి వర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగ సంఘాల అభ్యర్థన మేరకు హెల్త్ కేర్ ట్రస్ట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

10 ప్రతి సంవత్సరం సెప్టెంబర్లో డిపిసి వేయనుంది.

11 స్టేట్ లెవల్ మెడికల్ ఇన్వాలిడేషన్ కమిటీ ఏర్పాటు చేసేందుకు అంగీకరించింది.

12 జాయింట్ స్టేట్ కౌన్సిల్, అసోసియేషన్లను రికగ్నిషన్ చేసేందుకు ఒప్పుకుంది.

13 జిఒ 317లో ఇంకా కొన్ని కేటగిరీలను చేర్చాలని నిర్ణయం తీసుకుంది.

14 కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన తెలంగాణ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పేరు పెట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది.

15 రాష్ట్రంలో సన్న ధాన్యం పండించే రైతులను ప్రోత్సహించాలని మంత్రివర్గం నిర్ణయించింది.

16 సన్నాలకు బోనస్‌తో రైతులకు లబ్ధి చేకూరిందని, సన్న వడ్లకు బోనస్ కొనసాగించాలని మంత్రివర్గం నిర్ణయించింది.

17 స్వయం సహాయక సంఘాలకు ప్రమాద బీమా పథకం అమలుకు రూ.38.5 కోట్లు స్త్రీనిధికి కేటాయించాలని నిర్ణయం. ఇన్సూరెన్స్ కంపెనీలకు ప్రీమియం చెల్లించకుండా నేరుగా స్త్రీనిధి ద్వారా 385 మంది బాధిత కుటుంబాలకు ప్రమాదబీమా పరిహారం అందించాలని మంత్రివర్గం నిర్ణయం

18 రాష్ట్రంలోని అన్ని రోడ్లను అభివృద్ధి చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. హ్యామ్ విధానంలో అన్ని నియోజకవర్గాల్లో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకునేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

19 పంచాయతీరాజ్ పరిధిలో 7947 కిలోమీటర్లు, ఆర్ అండ్ బీ పరిధిలో 5190 కిలోమీటర్లు.. మొత్తం 13137 కిలోమీటర్ల రోడ్లను అభివృద్ధి చేస్తుంది.

20 పంచాయతీ రాజ్ రోడ్లకు రూ. 16 వేల 780 కోట్లు, ఆర్ అండ్ బీ రోడ్లకు రూ. 16 వేల 414 కోట్లు ప్రభుత్వం రాబోయే రోజుల్లో ఖర్చు పెడుతుంది.

22 హ్యామ్ విధానంలో రెండేండ్లలో నిర్మాణంతో పాటు 15 ఏళ్ల మెయింటెనెన్స్ కూడా ఏజెన్సీలదే బాధ్యత ఉంటుంది.

23 పార్లమెంట్ నియోజకవర్గం ఒక యూనిట్‌గా లేదా ఉమ్మడి జిల్లాల వారీగా ఒక్కో జిల్లా ఒక్కో ప్యాకేజ్ గా విభజించి రోడ్ల అభివృద్ధి చేయాలని నిర్ణయం

24 హైదరాబాద్ సిటీలో మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టుకు 86.1 కిలోమీటర్లకు రూ.19579 కోట్లతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌తో చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది.

25 కారిడార్-1లో శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు 39.6 కి.మీ.

26 కారిడార్-2 జూబ్లీ బస్ స్టేషన్ నుంచి మేడ్చల్ వరకు 24.5 కి.మీ.

27 కారిడార్-3 జూబ్లీ బస్ స్టేషన్ నుంచి శామీర్‌పేట్ వరకు 22 కి.మీ వరకు పొడిగించాలని నిర్ణయం

నేడు లాసెట్ పరీక్ష

- హాజరు కానున్న 57,715 మంది అభ్యర్థులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో లా కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే లాసెట్ రాతపరీక్ష శుక్రవారం ఆన్‌లైన్‌లో జరగనుంది. లాసెట్‌లో భాగంగా మూడేళ్ల లా కోర్సుకు 41,210 మంది, ఐదేళ్ల లా కోర్సుకు 11,695 మంది, ఎల్‌ఎల్‌ఎంకు 4,810 మంది కలిపి 57,715 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. వారి కోసం మొదటి, రెండో విడత పరీక్షలను నిర్వహించేందుకు 76 పరీక్షా కేంద్రాలు, మూడో విడత పరీక్ష నిర్వహణ కోసం 65 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మూడేండ్ల లా కోర్సులో ప్రవేశాల కోసం మొదటి విడత ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 12 నుంచి రెండు గంటల వరకు నిర్వహిస్తారు. ఐదేండ్ల లా కోర్సు, ఎల్‌ఎల్‌ఎంలో ప్రవేశాల కోసం మూడో విడత పరీక్షను సాయంత్రం నాలుగు నుంచి 5.30 గంటల వరకు జరుగుతుంది.

గ్రావ్టన్ మోటార్స్‌తో హైపర్ ఎలక్ట్రిక్ ఒప్పందం

హైదరాబాద్ : గ్రావ్టన్ మోటార్స్‌తో వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకున్నట్లు హైపర్ ఎలక్ట్రిక్ వెల్లడించింది. ఇందులో భాగంగా వచ్చే 24 నెలల్లో హైపర్ ఎలక్ట్రిక్ 10,000 విద్యుత్ ద్విచక్ర వాహనాలను కొనుగోలు చేయనుందని పేర్కొంది. తమ ఎలక్ట్రిక్ వాహనాలు అధిక పనితీరుతో, అగ్ని నిరోధకంగాద ఉంటాయని గ్రావ్టన్ మోటార్స్ వ్యవస్థాపకుడు పరశు రామ్ పాకా పేర్కొన్నారు. గ్రావ్టన్ మోటార్స్‌తో తమ భాగస్వామ్యం నాణ్యతతో కూడిన బైకులు ఫీల్డ్ టెస్టింగ్‌లో రుజువయ్యాయని హైపర్ ఎలక్ట్రిక్ సిఇఒ తల్లూరి సాయి రాహుల్ అన్నారు.

తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి

హైదరాబాద్ బ్యూరో : తాటి చెట్టు పై నుంచి కింద పడి గీత కార్మికుడు ప్రాణం కోల్పోయారు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం పరిధిలోని సిర్సవాడలో గురువారం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సిర్సవాడ గ్రామానికి చింతకింది మల్లేష్ (35) రోజువారి మాదిరిగానే ఉదయం కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కారు. ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. ఆయనకు ఇద్దరు పిల్లలు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న మల్లు భట్టీ విక్రమార్క

నిధుల సమీకరణపై దృష్టిపెట్టాలి

- డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క
- రిసోర్స్ మొబిలైజేషన్ క్యాబినెట్ సబ్‌కమిటీ భేటీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నిధుల సమీకరణపై అధికారులు తీవ్రంగా దష్టి సారించాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో రిసోర్స్ మొబిలైజేషన్ క్యాబినెట్ సబ్‌కమిటీ సమావేశం భట్టి విక్రమార్క అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సమావేశంలో సబ్‌కమిటీ సభ్యుడు మంత్రి జూపల్లి కష్ణారావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రెవెన్యూ రిసోర్స్ మొబిలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం ప్రతివారం జరుగుతుందనీ, ఇందులో తీసుకున్న నిర్ణయాలను వేగంగా అమలు చేయాలని డిప్యూటీ సిఎం అధికారులను ఆదేశించారు. ప్రగతిని వచ్చే వారం అంశాల వారీగా సమీక్షిస్తామని తెలిపారు. తాజాగా రెవెన్యూ రిసోర్స్ మొబిలైజేషన్‌కు సంబంధించి వివిధ శాఖల ఉన్నతాధికారులు చెప్పిన అంశాలు, వాటి పురోగతిని నిరంతరం పరిశీలించడానికి ఆర్థిక శాఖలో ప్రత్యేక అధికారిని నియమించాలని డిప్యూటీ సిఎం ఆదేశించారు. సమావేశంలో శాఖల వారీగా అంశాలను డిప్యూటీ సిఎం సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఆర్‌అండ్‌బి ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజు, ఎక్సైజ్, వాణిజ్యశాఖ ముఖ్యకార్యదర్శి రిజ్వీ, రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి కార్యదర్శి నవీన్ మిట్టల్, మైనింగ్ శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీధర్ , కమిషనర్లు హరిత, హరికిరణ్, విష్ణువర్ధన్, సురేంద్రమోహన్, బుద్ధ ప్రకాష్ జ్యోతి, ఇలంబర్తి , ఆర్‌వి కర్ణన్ పాల్గొన్నారు.

బీహార్ సర్పంచుల బృందం గ్రామ పంచాయతీల సందర్శన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బీహార్‌కు చెందిన సర్పంచులు రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధిలోని నర్కూడ, ముచ్చింతల్, కవ్వగూడ గ్రామ పంచాయతీలను గురువారం సందర్శించారు. రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ (ఎన్‌ఐఆర్‌డి)లో శిక్షణ పొందుతున్న సర్పంచులు.. శిక్షణలో భాగంగా గ్రామ పంచాయతీలను సందర్శించారు. గ్రామ పంచాయతీల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీలు నిర్వహిస్తున్న పల్లె ప్రకృతి వనం, నర్సరీల నిర్వహణతోపాటు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి అక్కడి పరిస్థితులను అధ్యయనం చేశారు. ఈ పర్యటనలో ఎన్‌ఐఆర్‌డీ ప్రోగ్రాం డైరెక్టర్ అరుణ జయమణి, గ్రామపంచాయతీ కార్యదర్శులు సీహెచ్ శ్రీకాంత్‌గౌడ్, జోష్న, పంచాయతీ కార్యదర్శులు ఎం.శ్రీకాంత్, ఎం.సమత, ముచ్చింతల్ మాజీ సర్పంచ్ బీర్ల పెంటయ్య, ఈసీ ప్రవీణ, కారోబార్ మధు, వీవోఏ షబానా పాల్గొన్నారు.



పంచాయతీలను సందర్శిస్తున్న బీహార్ సర్పంచ్‌ల బృందం

ఇథనాల్ కంపెనీ అనుమతులను రద్దు చేయాలి

- రైతుల అరెస్టుకు సిపిఎం ఖండన
- వెంటనే విడుదల చేయాలని జాన్‌వెస్లీ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్దధన్వాడ గ్రామ శివారులో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న 60 మందిని అక్రమంగా అరెస్ట్ చేసి, వారిలో 12 మందిని రిమాండ్‌కు పంపడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఇథనాల్ కంపెనీ అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేసింది. అరెస్టు చేసిన రైతులను వెంటనే విడుదల చేయాలని కోరింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కంపెనీ నిర్మాణానికి తీసుకున్న భూమికి సమీపంలో ప్రభుత్వం దళితులకిచ్చిన భూములు, ఇంటి స్థలాలు ఉన్నాయని తెలిపారు. దాని వల్ల వివిధ రకాల కాలుష్యం ఏర్పడుతందంటూ చుట్టు పక్కల గ్రామాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ నెలల తరబడి ఆందోళనలు చేస్తున్నారని గుర్తు చేశారు. గ్రామసభల తీర్మానం, గ్రామపంచాయితీ అనుమతి లేకపోయినా కంపెనీ యాజమాన్యం జెసిబిలు, టిప్పర్లు, కంటైనర్లతోపాటు, బయటి నుంచి కూలీలను తెచ్చి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిందని తెలిపారు. దీన్ని వ్యతిరేకించిన రైతులు, మహిళలు, ప్రజలపై పోలీసులు లాఠీఛార్జీ చేశారని విమర్శించారు. స్థానికంగా రైతులు, ప్రజల ఆమోదం లేకుండా, వారి అనుమతి లేకుండా పరిశ్రమను ఏర్పాటు చేయడం సరైంది కాదని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇథనాల్ కంపెనీని ఏర్పాటు చేయబోమంటూ కాంగ్రెస్ హామీ ఇచ్చినా, ప్రస్తుతం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. రిమాండ్‌కు పంపిన వారిని తక్షణమే విడుదల చేసి, అక్రమంగా బనాయించిన కేసులన్నింటినీ ఎత్తేయాలని డిమాండ్ చేశారు. ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును వెంటనే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని జాన్‌వెస్లీ కోరారు.

రెవెన్యూ సదస్సులను శాంతియుతంగా జరపాలి

ఏండ్ల తరబడి అధికారుల చుట్టూ తిరిగినా భూ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో చాలామంది రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని జాన్‌వెస్లీ తెలిపారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం పాత ఎల్లాపూర్ రెవెన్యూ సదస్సులో సమస్య చెప్పడానికి వచ్చిన వద్ధరైతు అల్లెపు వెంకటిని మెడపట్టి గెంటేసిన పోలీస్ అధికారిని సస్పెండ్ చేసే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న రెవెన్యూ సదస్సులను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ఘర్షణలు జరగకుండా శాంతియుత వాతావరణంలో జరపాలనీ, రైతుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు తిర్మలాపురంలో సిఎం పర్యటన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో



యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం తిర్మలాపురంలో శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించనున్నారు. ఆలేరు ప్రాంతంలో పలు అభివృద్ధి పనులకు సిఎం శంకుస్థాపన చేయనున్నారు. ప్రధానంగా గంధమల్ల రిజర్వాయర్, మెడికల్ కాలేజీ, వేద పాఠశాల(యాదగిరిగుట్ట), ఇంటిగ్రేటెడ్ స్కూల్ (తుర్కపల్లి), మూడు ప్రభుత్వ కార్యాలయాలు(మోటకొండూరు), ఆలేరు, కాల్వపల్లి బ్రిడ్జీలకు, రహదారులు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం మూడు గంటలకు యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం తిర్మలాపురానికి సీఎం చేరుకుంటారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారు. బందోబస్తు ఏర్పాట్లు చేసినట్టు రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు తెలిపారు.



సికింద్రాబాద్ జోన్‌లోని ప్రాంతాలను పరిశీలిస్తున్న కమిషనర్ కర్ణన్

రసూల్‌పుర ఫ్లైఓవర్‌కు భూసేకరణ పూర్తి చేయండి

- జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని రసూల్‌పుర ఫ్లైఓవర్ నిర్మాణానికి భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరుద్ధరణ పనుల నేపథ్యంలో కమిషనర్ గురువారం సికింద్రాబాద్ జోన్‌లోని పలు ప్రాంతాలను పరిశీలించారు. రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న బస్ స్టాప్‌లను పరిశీలించారు. రైల్వే సరిహద్దు నుంచి 24 మీటర్ల వరకు భూమి అవసరం ఉందని అధికారులు కమిషనర్‌కు తెలియజేశారు. బస్‌స్టాప్‌కు ప్రత్యామ్నాయ భూమిని కేటాయించి దానిని తరలించాల్సిన అవసరం ఉందని ప్రాజెక్ట్ ఎస్ఇ.శ్రీనివాస్ కమిషనర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ హెచ్ సిటీ ద్వారా రసూల్‌పుర వద్ద చేపట్టనున్న ఫ్లైఓవర్ నిర్మాణ స్థలాన్ని వెంటనే పరిశీలించి భూసేకరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

మంత్రి కొండా సురేఖకు స్వల్ప అస్వస్థత

- ప్రథమ చికిత్స అందించిన వైద్యులు
- విశ్రాంతి తీసుకోవాలని సూచన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

విరామం లేకుండా పనిచేయడం వల్ల రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గురువారం స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. సచివాలయంలో కళ్లు తిరిగి పడిపోయారు. వెంటనే సచివాలయంలోని వైద్యులు ఆమెకు ప్రాథమిక చికిత్స అందించారు. రెండ్రోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. సిఎం రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులు ఆమె దగ్గరకు వెళ్లి పరామర్శించారు. నియోజకవర్గంలో కార్యక్రమంలో విస్తృతంగా పాల్గొనడం, ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ పిసిబి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రోగ్రాంలో పాల్గొన్న వెంటనే సచివాలయంలో జరిగే క్యాబినెట్ సమావేశానికి హాజరయ్యేందుకు అవసరమైన డేటాను అధికారుల నుంచి సేకరించే క్రమంలో ఆమె ఆహారం తీసుకోలేకపోయారు. దీనివల్లనే ఆమె స్వల్ప అస్వస్థతకు గురయ్యారని మంత్రి కార్యాలయ సిబ్బంది తెలిపారు. వైద్యులు, సీఎం సూచన మేరకు విశ్రాంతి తీసుకునేందుకు హైదరాబాద్‌లోని తన నివాసానికి మంత్రి వెళ్లిపోయారు. వరంగల్ ఈస్ట్ నియోజకవర్గవాసులు, జిల్లాకు చెందిన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి సురేఖ పేర్కొన్నారు. సరైన ఆహారం, విశ్రాంతి లేకపోవడం వల్లనే ఇలా జరిగిందని తెలిపారు. తన ఆరోగ్యం నిమిత్తం వాకబు చేసిన ప్రతి ఒక్కరికీ మంత్రి ధన్యవాదాలు తెలిపారు.

మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణాన్ని కాపాడాలి

- భవిష్యత్‌లో ఆక్సిజన్ మాస్కులు పెట్టుకునే పరిస్థితి రావొద్దు
- మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భవిష్యత్ తరాలకు మంచి పర్యావరణం అందించేందుకు మొక్కలు నాటి, వాటిని పెంచి కాపాడాలని రవాణా బిసి సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కాలుష్య మండలి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ గోల్కొండ ఏరియా ఆసత్రిలో జహీరాబాద్ ఎంపి సురేష్ షెట్కార్, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహిద్దిన్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి మంత్రి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాలుష్య నియంత్రణమండలి పక్షాన జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్నామని, చెట్లు నీడ ఇవ్వడంతో పాటు ఆక్సిజన్ అందిస్తాయన్నారు. చెట్లను పెంచడం నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్‌లో ఆక్సిజన్ మాస్కులు పెట్టుకునే పరిస్థితి ఏర్పడుతుందని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని కోరారు. కాలుష్యం పెరిగిపోయి ప్రజలు క్యాన్సర్, షుగర్ వ్యాధుల బారినపడి మందులపై ఆధారపడుతున్నారని, కాలుష్యం పెరగకుండా.. హైదరాబాద్ మరో ఢిల్లీ కాకుండా.. చెట్లు నాటాలన్నారు. కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. గోల్కొండ ఏరియా ఆస్పత్రికి వచ్చే వారికి మొక్కలు నాటడంపై అవగాహన కల్పించాలన్నారు. పర్యావరణాన్ని కాపాడడానికి మొక్కలు నాటి ప్లాస్టిక్‌ను దైనందిన జీవితం నుంచి దూరం చేయాలన్నారు. మొక్కలు పెంచడం మన దిన చర్యగా భావించి పుట్టిన రోజులకు, ప్రత్యేక రోజులకు మొక్కలు నాటాలన్నారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. చెట్లు ప్రగతికి మెట్లని, ప్రతి ఒక్కరూ మొక్క నాటి సమాజంలో మార్పు తీసుకురావాలన్నారు. శుభ కార్యక్రమాల్లో కేకులను కట్ చేసి హంగామా సృష్టించే బదులు మొక్కలు వాడాలన్నారు. కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ జూట్ బ్యాగులను ఉపయోగించాలన్నారు. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మహియుద్దీన్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలన్నారు. గోల్కొండ ఆస్పత్రిలో ప్రతిరోజూ 1200 నుంచి 1500 మంది అవుట్ పేషెంట్లు వస్తున్నారని తెలిపారు. కొత్త భవనం నిర్మించేందుకు రూ.6 కోట్లు, యంత్రాల కొనుగోలు కోసం రూ.1.80 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. ఆస్పత్రిలో డాక్టర్లు, నర్సులు అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ పి.సురేష్, డీసీహెచ్‌ఎస్ సూర్యకుమారి, ఏరియా ఆస్పత్రి పర్యవేక్షకులు శ్రీనివాసరావు, కార్పొరేటర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, గోల్కొండ ఏరియా ఆస్పత్రి వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.



రండి ... రక్తదానం చేద్దాం

- మెడికోస్ బ్లడ్ డోనర్స్ క్లబ్ పోస్టర్ ఆవిష్కరణలో వక్తలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రక్తదానం చేసి ప్రాణాలను నిలిపేందుకు ప్రజలు ముందుకు రావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మెడికోస్ బ్లడ్ డోనర్స్ క్లబ్ పోస్టర్‌ను తెలంగాణ మెడికల్ కౌన్సిల్ (టిజిఎంసి) చైర్మన్ డాక్టర్ మహేశ్ కుమార్, వైస్ చైర్మెన్ డాక్టర్ శ్రీనివాస్, సభ్యులు డాక్టర్ సన్నీ డేవిస్ తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని వివిధ మెడికల్ కాలేజీల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా రాష్ట్రవ్యాప్తంగా వెయ్యికి పైగా రక్తదానాలను విజయవంతంగా నిర్వహించినట్లు చెప్పారు. ప్రతి మెడికల్ కాలేజీలో సమన్వయకర్తలతో రక్తదానంపై అవగాహన కల్పిస్తూ, రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నారు. రక్తదానం కోసం స్వచ్ఛందంగా ముందుకొస్తున్న వైద్య విద్యార్థులను వారు అభినందించారు. వారి త్యాగం ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ప్రజలకు అవగాహన కల్పించడం, వైద్య విద్యార్థులను, యువతను పెద్ద ఎత్తున భాగస్వాములు చేయడమే తమ లక్ష్యమని వివరించారు.

బిసి గురుకుల జూనియర్ కాలేజీలు అడ్మిషన్ రెండో దశ ఫలితాలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణరాష్ట్ర బిసి గురుకుల విద్యా సంస్థ (ఎంజెపిటిబిసిడబ్ల్యూఆర్‌ఇఐఎస్) ఆధ్వర్యంలో 2025-26 విద్యా సంవత్సరానికి జూనియర్ ఇంటర్మీడియట్ (ఆర్‌జెసి) అడ్మిషన్లకు సంబంధించి రెండోదశ ఫలితాలు వెల్లడైనట్లు ఆ సంస్థ కార్యదర్శి బడుగు సైదులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ల ద్వారా పరిశీలించవచ్చని పేర్కొన్నారు. https:// mjptbcw reis.telangana.gov.in, https:// mjpabc wreis.cgg. gov.in గతేడాది వరకు ప్రవేశ పరీక్ష ఆధారంగా సీట్లు కేటాయించగా, ఈ ఏడాది నుండి ఎలాంటి ప్రవేశ పరీక్ష లేకుండా, పదో తరగతిలో విద్యార్థులు సాధించిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. ఫలితాల్లో ఎంపికైన విద్యార్థులు తగిన డాక్యుమెంట్లు సిద్ధం చేసుకుని, శుక్రవారం నుంచి తొమ్మిదో తేదీ వరకు సంబంధిత కాలేజీల్లో అడ్మిషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు.

వెదురు టూత్ బ్రష్‌లపై క్యాంపెయిన్

హైదరాబాద్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మహవీర్ హాస్పిటల్ దంత విభాగం ద్వారా పర్యావరణహితమైన బంబూ (వెదురు) టూత్‌బ్రష్‌లను ఆవిష్కరించినట్లు టెంపెస్ట్ అడ్వర్టైజింగ్ పేర్కొంది. బయోడిగ్రేడబుల్ వెదురు బ్రష్‌లతో ప్రతి ఉదయాన్ని 'మైండ్‌ఫుల్ మార్నింగ్'గా పచ్చదనంతో ప్రారంభించేలా ఓ ప్రత్యేక క్యాంపెయిన్‌ను ప్రారంభించినట్లు తెలిపింది.

ఆశీర్వాద ఆటా ప్రచారకర్తగా స్నేహ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో



గోధుమ పిండి బ్రాండ్‌గా పేరుగాంచిన ఆశీర్వాద్ ఆటా తన నూతన ప్రచారకర్తగా నటీ స్నేహను నియమించుకుంది. ఆశీర్వాద్ ఎల్లప్పుడూ తమ వినియోగదారులకు రాజీలేని నాణ్యతను అందిస్తుందని ఐటిసి ఫుడ్స్ ప్రతినిధి అనుజ్ కుమార్ రుస్తగి పేర్కొన్నారు. నాణ్యత హామీ పేరుతో కొత్త ప్రచారాన్ని ప్రారంభించామన్నారు.

ఆకు పచ్చ తెలంగాణ కోసం కృషి చేద్దాం: సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆకుపచ్చ తెలంగాణ కోసం ప్రజలందరూ కృషి చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఎక్స్ వేదిక ద్వారా పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని మనమందరం ప్రకృతిని కాపాడేందుకు కంకణబద్దులు కావాలని పేర్కొన్నారు. 'పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది.

ప్రకృతి రక్షణ, పునరుజ్జీవనం, పునర్వినియోగం, స్థిరత్వం కోసం కృషి చేద్దాం. ఈ క్రమంలో సర్కార్ తీసుకుంటున్న కఠినమైన నిర్ణయాలకు సహకరించండి. అందరం కలిసి తెలంగాణను భూమిపై ఆకుపచ్చ, ప్రదేశాలలో ఒకటిగా మార్చడానికి పాటు పడుదాం" అని సీఎం పేర్కొన్నారు.

పువ్వాడ లక్ష్మణ ఇంట్లో నకిలీ మందుల పట్టివేత



నకిలీ మందులను స్వాధీనం చేసుకున్న పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నేర ప్రవృత్తి కలిగిన పువ్వాడ లక్ష్మణ ఇంట్లో పెద్ద ఎత్తున నిల్వ ఉంచిన నకిలీ మందులు పట్టుబడ్డాయి. విశ్వసనీయ సమాచారం మేరకు డ్రగ్ కంట్రోల్ అధికారులు హైదరాబాద్ మలక్‌పేట్‌లోని మూసారాంబాగ్‌లో గల పువ్వాడ లక్ష్మణ ఇంట్లో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో రూ.5.1 లక్షల విలువైన నకిలీ మందులతోపాటు యాంటీబయాటిక్స్, యాంటీ హైపర్‌టెన్సివ్, అబార్షన్ కిట్లు దొరికినట్టు అధికారులు తెలిపారు. ఎలాంటి లైసెన్స్ లేకుండా మందులను ఆ ప్రాంగణంలో నిల్వ ఉంచినట్టు చెప్పారు. అతనిపై ఇది వరకే నకిలీ మందులకు సంబంధించి పలు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. పట్టుబడ్డ వాటిలో నాలుగు అనుమానిత నకిలీ మందులను గుర్తించారు. కేసు నమోదు చేసిన అధికారులు విచారణ చేపట్టారు. చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్టు వారు తెలిపారు.

ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్‌కు తీవ్ర అస్వస్థత

- గచ్చిబౌలిలోని ఏఐజి ఆస్పత్రిలో చికిత్స

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనకు గచ్చిబౌలిలోని ఏఐజి ఆస్పత్రికి తరలించగా.. చికిత్సనందిస్తున్నారు. వివరాల్లోకెళ్తే.. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ గురువారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో అస్వస్థతకు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు గచ్చిబౌలిలోని ఏఐజి ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ వైద్యం అందించిన డాక్టర్లు ఆయనకు ఎలాంటి ప్రమాదమూ లేదని, 48 గంటలపాటు అబ్జర్వేషన్‌లో ఉంచామని తెలిపారు. వైద్యానికి పూర్తిగా సహకరిస్తున్నారని చెప్పారు. సమాచారం అందుకున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేక్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కు మార్ ఆస్పతికి వెళ్లారు. బిఆర్ఎస్ నాయకులు, కార్య కర్తలు ఆస్పత్రి వద్దకు భారీగా చేరుకున్నా రు. ఇదిలా ఉండగా, పలు సామాజిక మాధ్య మాల్లో ఎమ్మెల్యే చనిపోయి నట్టు వార్తలు రావడంతో బిఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అసత్య వార్తలను ఎవరూ నమ్మొద్దని డాక్టర్లు, బిఆర్ఎస్ నాయకులు సూచించారు.

'మహేంద్ర అండ్ మహేంద్ర'లో నాలుగోసారి సిఐటియు విజయం

- ఈ విజయం కార్మికులదే.. మెరుగైన సేవలందిస్తా : అధ్యక్షులు చుక్క రాములు



చుక్క రాములను అభినందిస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని మహేంద్ర ఎడి ప్లాంట్‌లో గురువారం జరిగిన కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు వరుసగా నాలుగోసారి విజయం సాధించారు. పరిశ్రమలో మొత్తం 543 ఓట్లు ఉండగా 539 ఓట్లు పోలయ్యాయి. అందులో ఐఎన్‌టియుసి అభ్యర్థి జనక్ ప్రసాద్‌కు 369 ఓట్లు రాగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు, పరిశ్రమ యూనియన్ అధ్యక్షులు చుక్కరాములుకు 370 ఓట్లు వచ్చాయి. దాంతో ఒక ఓటుతో చుక్క రాములు నాలుగోసారి విజయం సాధించి మహేంద్ర అండ్ మహేంద్ర పరిశ్రమ గ్రూపులోనే చరిత్ర సృష్టించారు. విజయం సాధించిన వెంటనే గేట్ ముందుకు వచ్చిన చుక్క రాములును కార్మికులు నినాదాలు చేస్తూ తమ భుజస్కందాలపై మోసి ఆనందాన్ని వ్యక్తం చేశారు. బాణాసంచా పేల్చుతూ ఎడి ప్లాంట్ నుంచి టెక్నీషియన్ కాలనీ, మహేంద్ర ఎంప్లాయీస్ కాలనీ వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం చుక్క రాములు మాట్లాడుతూ.. కార్మికులు తమపై నమ్మకం ఉంచి ఓట్లు వేసి గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయం కార్మికులదేనన్నారు. ఎన్నికల గేట్ మీటింగ్ సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చి కార్మికులందర్నీ ఐక్యపరిచి వారి సమస్యల పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తామని తెలిపారు. ఇప్పటికే పరిశ్రలో గత యూనియన్లు తాకట్టు పెట్టిన కార్మికుల హక్కులన్నింటినీ విడిపించి ప్రతి కార్మికునికి న్యాయం జరిగే విధంగా చర్యలు చేపట్టామని, దాని వల్లనే తనను కార్మికులు గెలిపించారన్నారు. ప్రధానంగా కార్మికుల పిల్లల్లో పదవ తరగతి పాసైన వారికి ట్రైనింగ్ ఇచ్చి పరిశ్రమలో ఉద్యోగం కల్పించడం, డిఎ పెంచడం, అర్హులైన కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయించడం, కార్మికుల బేసిక్ శాలరీ పెంచేందుకు చేసిన కృషి ఫలితమే ఈ విజయమని చెప్పారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు బీరం మల్లేశం మాట్లాడుతూ.. మహేంద్ర అండ్ మహేంద్ర కార్మికులు ఇచ్చిన తీర్పును శిరసావహిస్తామన్నారు. కార్మికులకు మెరుగైన సేవలతో పాటు వారి హక్కులను పరిరక్షించేందుకు అన్ని విధాలా చర్యలు చేపడతామన్నారు. ఈ విజయం మహేంద్ర అండ్ మహేంద్ర పరిశ్రమలో కార్మికులతో పాటు వారి కుటుంబ సభ్యుల విజయమంటూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సాయిలు, నాయకులు మహిపాల్, కనకారెడ్డి, రాజిరెడ్డి, మాణిక్, వీరయ్య గౌడ్, ఉమామహేశ్వరరావు, నరేష్, మహేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ క్షీణత అత్యంత ప్రమాదకరం

- అడవులను పునరుద్ధరించండి
- సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యిద్ అజీజ్ పాషా

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పర్యావరణ క్షీణత అనేది అత్యంత ప్రమాదకరమని సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్), ఆల్ ఇండియా తంజీమ్ -ఎ - ఇన్సాఫ్ సంయుక్తాధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య పార్క్ వద్ద ప్రదర్శన నిర్వహించారు. ప్లకార్డులు చేతబూని భూమి మనుగడ, మన ప్రాధాన్యత. భూమి అందం మన కర్తవ్యం, ఆకుపచ్చగా ఆలోచించండి, శుభ్రంగా జీవించండి, రేపటి కోసం ఈరోజే భూమిని కాపాడుకుందామంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అజీజ్ పాషా మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్‌లో ప్రపంచంలోనే భారత దేశం నెంబర్ టుగా ఉందని గుర్తు చేశారు. అందులో దక్షిణ భారత దేశంలో తెలంగాణ నెంబర్ వన్‌గా ఉందనీ, ఇది ప్రజల జీవితాలు, జీవనోపాధికి హాని కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. పెరుగుతున్న జనాభా, ప్రబలమైన పారిశ్రామికీకరణ, ప్రభుత్వాల తిరోగమన విధానాలు పర్యావరణానికి భారీ ముప్పును కలిగిస్తున్నాయని చెప్పారు. రాష్ట్రంలో అత్యధికంగా 2014 నుండి 2024 వరకు 11,422 హెక్టార్ల అటవీ భూమిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేసారు. వాతావరణ సంక్షోభం, క్షీణిస్తున్న గాలి నాణ్యత, అటవీ నిర్మూలన, ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగం ప్రజల జీవితాలను ప్రమాదంలో పడవేస్తున్నాయని వాపోయారు. ఇది గ్లోబల్ వార్మింగ్ కు నిదర్శనమని చెప్పారు. పట్టణ ప్రకృతి దృశ్యానికి ప్రాణం పోసే కంచ గచ్చిబౌలి అడవిని రాష్ట్ర ప్రభుత్వం రియల్ ఎస్టేట్ కోసం వేలం వేసేందుకు ప్రయత్నించటం శోచనీయమన్నారు. అక్కడ ఉన్నసహజ గడ్డి, చెట్లను నరకడం, వన్యప్రాణులకు హాని జరగడం దారుణమన్నారు. సుప్రీంకోర్టు జోక్యంతో ఆ భూములు రక్షించబడ్డాయని చెప్పారు. కార్యక్రమంలో ఇస్కఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రేఖల గోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ కడారి ప్రభాకర్, నాయకులు ఎ. విజయ లక్ష్మి, ఇన్సాఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మునీర్ పటేల్, సిపిఐ ముషీరాబాద్ నియోజకవర్గం సహాయ కార్యదర్శి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రజలు సహకరించాలి

- పర్యావరణాన్ని రక్షించుకోకుంటే భవిష్యత్ తరాలకు తీవ్ర నష్టం
- అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో విచ్చల విడిగా పెరిగిపోతున్న ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రజలు సహకరించాలని అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించకుంటే భవిష్యత్ తరాలకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నప్పటికి ప్రజల భాగస్వామ్యం లేకుంటే అది సాధ్యం కాదని అభిప్రాయపడ్డారు. ప్లాస్టిక్ వ్యర్థాల మూలంగా సహజ వనరులు కలుషితం కావడంతో సమస్త జీవరాశులకు పెను ముప్పు వాటిల్ల బోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. 1960, 1970ల నుంచి సముద్రాల్లో ప్లాస్టిక్ పెద్ద ఎత్తున పేరుకుపోతున్నట్టు శాస్త్రీయ అధ్యయనాలు చెబుతున్నాయని తెలిపారు. భారతదేశం ప్రతి సంవత్సరం సుమారు 12.65 కోట్ల కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను ఉత్పత్తి చేస్తోందని పేర్కొన్నారు. 2026 నాటికి ఈ సంఖ్య 50 కోట్లకు పైగా ఉంటుందని పర్యావరణ వేత్తలు అంచనా వేస్తున్నారని వివరించారు. ఇదే ధోరణి కొనసాగితే, 2050 నాటికి ఈ సంఖ్య 1,200 కోట్ల టన్నులకు చేరవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మహమ్మారి వాడకాన్ని తగ్గించడంతో పాటు చెట్లను విరివిగా నాటాలని కోరారు. గతేడాది తెలంగాణ ప్రభుత్వం 20.2 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా, 19.04 కోట్ల మొక్కలను నాటామని తెలిపారు. ఈ ఏడాది కూడా భారీ స్థాయిలో మొక్కలు నాటాలని నిర్ణయించినట్టు తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనకు విద్యార్థులు, యువత, పర్యావరణ ప్రేమికులు, సామాజిక కార్యకర్తల భాగస్వామ్యంతో విస్తృత ప్రచారం నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పీసీబీ మెంబర్ సెక్రటరీ రవి గూగులోత్, బోర్డు మెంబర్లు సత్యనారాయణరెడ్డి, విజయ లక్ష్మీ, జయదేవ్, ఉద్యోగులు, సిబ్బంది విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ సంక్షేమ పథకాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఏఐసిసి ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపు నిచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వరంగల్ పార్లమెంటు నియోజకవర్గాల సమీక్షా సమావేశంలో వారు మాట్లాడారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాల ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నదని తెలిపారు. ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని రాబోయే ఎన్నికల్లో అనుకూలంగా మలచుకోవాలని కోరారు. పార్టీ నేతలంతా సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు సూటిగా వివరించాలని చెప్పారు. సీనియర్లు, జూనియర్లు సమన్వయంతో వ్యవహరించి ప్రజల్లో విశ్వాసం కల్పించాలని కోరారు. స్థానిక సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో కృషి చేయాలని సూచించారు. దేశాన్ని ఆశ్చర్యపరిచే విధంగా సంక్షేమ పథకాలను అమలవుతున్నాయని చెప్పారు. కుల సర్వే, ఎస్‌సి వర్గీకరణ, సన్న బియ్యం పంపిణీ, భూ భారతి పట్ల ప్రజల్లో సానుకూల స్పందన వస్తోందని చెప్పారు. పార్టీ సంస్థాగత నిర్మాణం, ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం లాంటి అంశాలపై ప్రజల్లో చర్చించాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మహేష్‌కుమార్, పక్కన మీనక్షి నటరాజన్

కమిటీల ఆలస్యం వల్ల కార్యకర్తల్లో నైరాశ్యం

టిపిసిసి రాష్ట్ర కార్యవర్గం ఆలస్యం కావడంతో కార్యకర్తల్లో నైరాశ్యం నెలకొందని మహేష్ అన్నారు. త్వరలోనే అర్హతల ఆధారంగా పార్టీ పదవులు ఇస్తామన్నారు. 17 నెలల పాలనలో ఎమ్మెల్యేలు తమ పని తీరును బేరీజు వేసుకోవాల్సిన అవసరముందని చెప్పారు. రాబోయే స్థానిక ఎన్నికల ఫలితాలు ఎమ్మెల్యేలపై ప్రభావం చూపుతాయన్నారు. చురుకైన నాయకుల్ని గుర్తించి పీసీసీ పర్యవేక్షకులుగా నియమించామని చెప్పారు. పార్టీకి ప్రభుత్వానికి నాయకులు వారధిగా పని చేయాలని సూచించారు.

ఢిల్లీ జిఎంఆర్ ఏరో సిటీలో రెండు కొత్త హోటళ్లు



న్యూఢిల్లీ : ప్రముఖ హిల్టన్ హోటల్స్ కొత్తగా ఢిల్లీ జిఎంఆర్ ఏరో సిటీలో రెండు హోటళ్ల ఏర్పాటుకు ముందుకు వచ్చింది. ఇందుకోసం జిఎంఆర్ గ్రూప్ నేతృత్వంలోని ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ప్రపంచ స్థాయి హోటల్ రిసార్ట్స్ సేవలను ఢిల్లీలో అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు హిల్టన్ హోటల్స్ వెల్లడించింది. ఇందులో 150 రూములు, సూట్లు, అద్భుతమైన డైనింగ్, ఈవెంట్స్ కోసం అతిపెద్ద స్థలం, స్పా వంటి అన్ని సదుపాయాలు అందుబాటులో ఉంటాయని వెల్లడించింది. హిల్టన్ సంస్థ జిఎంఆర్ ఏరోసిటీలో హెూటల్స్ ఏర్పాటుకు ముందుకు రావడంపై జిఎంఆర్ గ్రూప్ కార్పొరేట్ చైర్మన్ కుమార్ గ్రంధి సంతోషం వ్యక్తం చేశారు.

గెలాక్సీ ఎస్25 అల్ట్రా ధరలు తగ్గింపు

గూర్‌గావ్ : ప్రముఖ స్మార్ట్‌ఫోన్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ తన గెలాక్సీ ఎస్25 అల్ట్రా ధరలను తగ్గించినట్లు తెలిపింది. తొలుత రూ.1,29,999 ప్రారంభ ధరతో లభించిన గెలాక్సీ ఎస్ 25 అల్ట్రాను ఇప్పుడు రూ.1,17,999 వద్ద అందుబాటులో ఉంటుందని పేర్కొంది. రూ.12000 తక్షణ క్యాష్‌బ్యాక్ అందిస్తున్నట్లు వెల్లడించింది. 200ఎంపి వైడ్-యాంగిల్ కెమెరా అధిక రిజల్యూషన్ సెన్సార్ కెమెరాతో దీన్ని ఆవిష్కరించింది.

విత్తన పంపిణీ విజయవంతం

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గ్రామ గ్రామాన నాణ్యమైన విత్తన పంపిణీ కార్యక్రమం విజయవంతగా ముగిసిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఫలితంగా రాష్ట్రంలోని 35 వేల మంది అభ్యుదయ రైతులకు లబ్దిచేకూరిందని తెలిపారు. ఈ మేరకు మంత్రి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాష్ట్ర వ్యవసాయ శాఖ సహకారంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టాయని పేర్కొన్నారు. ఈ నెల 2న మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఎంపిక చేసిన రైతులకు విత్తన ప్యాకెట్లను అందజేశారని తెలిపారు. ఇప్పటివరకు సుమారు 2500 క్వింటాళ్ల నాణ్యమైన మూల విత్తనాన్ని అన్ని రెవిన్యూ గ్రామాల్లో పంపిణీ చేసినట్టు తెలిపారు. 20వేల వరి విత్తన కిట్లు, జొన్న 1,522, కంది 4,568, పెసర 8,910 విత్తన కిట్లను అందించామని వివరించారు.

సింగరేణి సిఆర్‌టిలకు మినిమం టైమ్‌స్కేల్ వర్తింపజేయాలి

- ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో: సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాలలు, కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులకు కనీస మూలవేతనం (ఎంటిఎస్)ను వర్తింపజేయాలనీ, 12 నెలల వేతనం చెల్లించాలని ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సింగరేణి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బలరాంను గురువారం హైదరాబాద్‌లో ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. సింగరేణి సిఎండీ సానుకూలంగా స్పందించారని తెలిపారు. త్వరలోనే ఉత్తర్వులను విడుదల చేస్తామంటూ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అధ్యాపకులు, ఉపాధ్యాయులకు సింగరేణి ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందించాలని కోరారు.

హైదరాబాద్‌లో రాఫేల్ విడిభాగాల తయారీ

టాటా, డసల్ట్ ఏవియేషన్ ఒప్పందం



ముంబయి : భారత వైమానిక దళంలో కీలకంగా ఉన్న రఫేల్ యుద్ధ విమానాలకు సంబంధించిన పరికరాల తయారీ కోసం టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్, ఫ్రాన్స్‌కు చెందిన రాఫేల్ మాతృ సంస్థ డసల్ట్ ఏవియేషన్‌లు పరస్పరం ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇరు కంపెనీలు భారత్, ఇతర ప్రపంచ మార్కెట్ల కోసం రఫేల్ యుద్ధ విమానాలను సరఫరా చేయడానికి నాలుగు ప్రొడక్షన్ ట్రాన్స్‌ఫర్ ఒప్పందాలపై సంతకాలు చేశాయి. రాఫేల్ యుద్ధ విమానాలకు చెందిన ప్రధాన భాగాలు హైదరాబాద్‌లోని టిఎఎస్-ఎల్‌లో తయారు చేయాలని నిర్ణయించాయి. ఫ్రాన్స్ వెలుపల రఫేల్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేయడంలో ప్రపంచంలోనే ఇది తొలిసారి కావడం విశేషం. హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్న ఈ తయారీ కేంద్రం భారతదేశ ఏరోస్పేస్ మౌలిక సదుపాయాల్లో కీలకమైన పెట్టుబడికి ప్రాతినిధ్యం వహిస్తుందని డసో పేర్కొంది. ఆర్థిక సంవత్సరం 2027-28 నాటికి ఫ్యూజ్‌లేజ్ అసెంబ్లింగ్ లైన్, ఎయిర్‌క్రాఫ్ట్ విడిభాగాలను ఉత్పత్తి చేసే లక్ష్యంతో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ సంస్థ ఏర్పాట్లు చేయనుంది. నెలకు రెండు ఫ్యూజ్‌లేజ్‌లను అందించనున్నారు. భారత్‌లో తమ ఉత్పత్తిని బలోపేతం చేయడంలో ఇది నిర్ణయాత్మక అడుగు అని భారత రక్షణ రంగంలో తమ సేవలను విస్తరిస్తున్నందుకు ధన్యవాదాలని డసో ఏవియేషన్ ఛైర్మన్ అండ్ సిఇఒ ఎరిక్ ట్రాపియర్ పేర్కొన్నారు. ఈ నిర్ణయం రాఫేల్ విస్తరణకు మరింత దోహదం చేస్తుందన్నారు. అంతేకాకుండా నాణ్యమైన సేవలు అందించడంతో పాటుగా సైనిక అవసరాలను తీర్చేందుకు ఉపయోగపడుతుందన్నారు. భారత రక్షణ రంగ చరిత్రలో ఈ ఒప్పందం ఓ మైలురాయిగా నిలుస్తుందని టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సుకరన్ సింగ్ తెలిపారు. డసల్ట్ ఏవియేషన్ సంస్థతో చేసుకున్న ఈ ఒప్పందం టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ సామర్థ్యాలను గుర్తు చేస్తుందన్నారు.

సర్కారు బడుల్లో విద్యార్థుల నమోదు పెంచడమే లక్ష్యం

- నేటినుంచి జయశంకర్ బడిబాట
- రాష్ట్ర వ్యాప్తంగా 19 వరకు నిర్వహణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 2025-26 విద్యాసంవత్సరంలో జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం ఈనెల 19 వరకు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతుంది. మొదటిరోజు గ్రామసభ నిర్వహించాలి. ఏడున ప్రతి ఇంటినీ సందర్శించి బడిఈడు పిల్లలను గుర్తించాలి. అయితే బక్రీద్ పండుగ ఉన్నందున ముస్లిం ఉద్యోగులు, ఉపాధ్యాయులు మినహాయింపు ఉంటుంది. ఎనిమిది నుంచి పదో తేదీ వరకు కరపత్రాలతో ఇంటింటి ప్రచారం చేపట్టాలి. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించాలి. డ్రాపౌట్ పిల్లలను గుర్తించి వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడంతోపాటు ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను అందుబాటులో ఉన్న భవిత కేంద్రాల్లో చేర్పించాలి. ఈనెల 11న బడిబాట ప్రారంభం నుంచి నిర్వహించిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించాలి. 12న పాఠశాలల పున:ప్రారంభం రోజే అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను ప్రజాప్రతినిధులతో ప్రారంభించాలి. అదేరోజు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫారాలను అందించాలి. 13న సామూహిక అక్షరాభ్యాసం బాలల సభను నిర్వహించాలి. 16న ఎఫ్‌ఎల్‌ఎన్, లిప్ దినోత్సవం జరపాలి. 17న విలీన విద్య, బాలిక విద్యా దినోత్సవం నిర్వహించాలి. 18న తరగతి గదుల డిజిటలీకరణపై అవగాహన, మొక్కల పెంపకంపై ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించాలి. ఈనెల 19న జయశంకర్ బడిబాట ముగింపు సందర్భంగా విద్యార్థులకు క్రీడాపోటీలను నిర్వహించాలి. బడిబాటను విజయవంతం చేసేందుకు అన్ని జిల్లాల డీఈవోలు, ఈవో-డీపీవోలు, సమగ్ర శిక్ష అధికారులు తగిన చర్యలు చేపట్టాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించాలి. అన్ని ఆవాసాల్లో బడిఈడు పిల్లలను గుర్తించి వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదును పెంచాలనీ, నాణ్యమైన విద్యను అందించాలి. విద్యార్థుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించాలి. స్వయం సహాయక బృందాలు (ఎస్‌హెచ్‌జీ), అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు (ఏఏపీసీ) సహాయం తీసుకుని ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలి. విలేజ్ ఎడ్యుకేషన్ రిజిస్టర్ (వీఈఆర్)ను అప్‌డేట్ చేయాలి. పర్మినెంట్ ఎన్‌రోల్‌మెంట్ నెంబర్ (పీఈఎన్)ను అప్‌డెట్ చేయాలి. ప్రాథమిక పాఠశాలల్లో ఐదో తరగతి, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఏడో తరగతి పూర్తి చేసిన విద్యార్థులను ఆరో తరగతి, ఎనిమిదో తరగతిలో చేర్పించాలి. తక్కువ పిల్లలున్న పాఠశాలలను గుర్తించి వాటిలో పిల్లల సంఖ్యను పెంచేందుకు ప్రణాళికను రూపొందించాలి. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించాలి. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల సహాయంతో వారి వయసుకు తగ్గ తరగతిలో చేర్పించాలి. బాలికల నమోదును పెంచాలి. తల్లిదండ్రులు, విద్యార్థులు, పౌరసమాజంలో విద్యాహక్కు చట్టం (ఆర్టీఈ) గురించి అవగాహన కల్పించాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలకు హాజరయ్యేలా చూడాలి. జయశంకర్ బడిబాట కార్యక్రమంలో కలెక్టర్లు, డీఈవోలు, ఎంఈవోలు, హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులు ముఖ్యపాత్ర పోషించాలని విద్యాశాఖ అధికారులు సూచించారు.

వికలాంగుల కార్పొరేషన్ ద్వారా సహాయ ఉపకరణాలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వికలాంగుల కార్పొరేషన్ ద్వారా ఉచితంగా అందించే సహాయ ఉపకరణాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం విధి విధానాలను ప్రకటిస్తూ జీవో 89 జారీ చేసిన నేపథ్యంలో ఆ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య సిఎం రేవంత్‌రెడిక్డి, మంత్రి సీతక్కకు ధన్యవాదాలు తెలిపారు. వికలాంగుల సౌకర్యాలకు సంబంధించి మొదటి బోర్డు మీటింగ్‌లో చేసిన నూతన సంస్కరణలపై సానుకూలంగా నిర్ణయం తీసుకోవటం వికలాంగుల పట్ల ప్రభుత్వ చిత్త శుద్ధికి నిదర్శనమని తెలిపారు.

హ్యుందాయ్ వర్న కొత్త వేరియంట్ విడుదల



న్యూఢిల్లీ: హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్ఎంఐఎల్) కొత్తగా ఎస్ఎక్స్ ప్లస్ వేరియంట్‌ను విడుదల చేసినట్లు ప్రకటించింది. దీని ఎక్స్‌షోరూం ధరను రూ.13,79,300గా నిర్ణయించింది. ఇది మరింత సౌకర్యవంతమైన డ్రైవింగ్, ఇతర ఫీచర్లను కలిగి ఉందని ఆ కంపెనీ పేర్కొంది.

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగ నియామకాలు చేపట్టాలి

- కనీస వేతనాలు అమలయ్యేలా చూడాలి
- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి సిఐటియు వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగుల నియామకాలు చేపట్టాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్ డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులకు కనీసవేతనాలు, సౌకర్యాలు అమలయ్యేలా చూడాలని కోరారు. గురువారం ఈ మేరకు హైదరాబాద్‌లో లేబర్, టెక్స్‌టైల్స్, నైపుణ్యాల అభివృద్ధికి సంబంధించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ బసవరాజు బొమ్మైకి సిఐటియు బృందం వినతిపత్రం అందజేసింది. రాష్ట్రంలోని బెల్, బిఇఎల్, ఇసిఐఎల్, హాల్, ఎన్ఎమ్‌డిసి, ప్రజ్ఞాటూల్స్, మిధానీ, బిడిఎల్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, డిఆర్‌డిఒ ల్యాబ్స్, సింగరేణి, ఆయిల్ తదితర కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో లక్ష మందికిపైగా కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారని ప్రస్తావించారు. ఆ సంస్థలు 70 నుంచి 90 శాతం దాకా వారిపైనే ఆధారపడి నడుస్తున్నాయని వివరించారు. ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్న వారికి కనీస వేతనాలు అమలు కావడం లేదనీ, చట్టాలు వర్తింపజేయడం లేదని వాపోయారు. వారికి ఉద్యోగ భద్రత కూడా లేదని చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయడంలో భాగంగా నియామకాలు చేపట్టాలని కోరారు. హయ్యర్ పెన్షన్ విధానాన్ని అమలు జరపాలని విన్నవించారు. కాంట్రాక్ట్ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్‌లపై ఉన్న సీలింగ్‌ను ఎత్తేయాలనీ, ప్రత్యేక వేతనాలను నిర్ణయించి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రాట్యూటీ చెల్లించాలనీ, కోలిండియాలో చెల్లిస్తున్న విధంగా సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. బిహెచ్ఇఎల్ (రామచంద్రాపురం)లో పర్మినెంట్ కార్మికులకు క్యాంటీన్ సబ్సిడీ తొలగింపు, ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం తొలగింపు వంటి హక్కులను తిరిగి పునరుద్ధరించాలని కోరారు. బీడీఎల్‌కు కేంద్ర ప్రభుత్వం ఆర్డర్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల హక్కులను పరిరక్షించాలని కోరారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాని విజ్ఞప్తి చేశారు. మెమోరాండం అందజేసిన బృందంలో జె.వెంకటేశ్‌తో పాటు టి.సత్తయ్య, మురళి, రవీందర్ (బీడీఎల్), పి.ఎ.రెడ్డి (సెయిల్), ఎమ్‌డీ నాగుల్ బాషా (బిహెచ్ఇఎల్), తదితరులున్నారు.